మాయామాళవగౌళ - చతురశ్ర ఏక

తందనాన ఆహి - తందనానపురె
తందనాన భళా - తందనాన

బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మమొక్కటే
బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మమొక్కటే

కందువగు హీనాధి - కములిందు లేవు
అందరికి శ్రీహరే - అంతరాత్మ
ఇందులో జంతుకుల - మింతా నొక్కటే
అందరికి శ్రీహరే - అంతరాత్మ.

నిండార రాజు నిద్రించు -నిద్రయునొక్కటే
అండనే బంటు నిద్ర - అదియునొకటే
మెండైన బ్రాహ్మణుడు - మెట్టు భూమి యొకటే
చండాలు డుండేటి - సరి భూమి యొకటే

కడగి యేనుగుమీద - గాయు నెండొకటే
పుడమి శునకము మీద - బొలయు నెండొకటే
కడు పుణ్యులను పాప - కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటే - శ్వరు నామ మొక్కటే

అన్నమాచార్యులు అద్వైతి అన్న మాటను ఈ సంకీర్తనలోని అద్వైతతత్వం బలపరుస్తుంది. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అని ఉద్ఘాటించారు అన్నమాచార్యులు. ఏకం సత్ - విప్రా బహుధావదంతి అని తత్ప్రమాణం.

సృష్టిలో ఉన్న న్యూనాధికతలు, ఎక్కువతక్కువలు లేని చోటు ఒక్కటే - పశుపక్షి మత్స్యాది జీవకోటికి సమత్వం సిద్ధించేది భగవత్సన్నిధిలో మాత్రమే. ఆ శ్రీహరి జగదంతరాత్ముడు గనుక జగత్తంతా ఒక్కటే.

రాజుకీ సేవకునికి - తదితర పశుపక్ష్యాదులకూ ఆహార నిద్రాభయమైథునాలు తుల్యాలు. ఈ విషయాన్ని గుర్తించేవారు పండితులని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముని

www.greenmangos.net

ప్రబోధం.

విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగ విహస్తినీ
శుని చైవశ్వపాకేచ పండితాస్సమదర్శినః అన్నగీతావాక్యార్థమిదే.

ఏనుగు మీద గాసినా, కుక్కపైన ప్రసరించినా ఎండ ఒక్కటే. గర్భేష్వం భోరుహాణాంశిఖరిషుచ శితాగ్రేషుతుల్యం పతంతః అని సూర్యశతకం. తామర బొడ్డులోనూ, పర్వతశిఖరపు వాడి అగ్రంపైనా తుల్యంగానే పడుతుంది సూర్యకాంతి.

పుణ్యులైనా పాపకర్ములైనా ఎవ్వరైనాగానీ వారికి ఐహికాముష్మిక రక్షణ నిచ్చేది, ఇవ్వగలిగినది శ్రీవారితిరునామమే, శ్రీవేంకటేశ్వరుడే బ్రహ్మం - పరబ్రహ్మం. అదీ ఇదీ ఒక్కటే అంటూ తందనానల చిందులువేస్తూ అద్వైత్వాన్ని అందలమెక్కించారు అన్నమాచార్యులు.

www.greenmangos.net